# పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకు మరియు వారి సహాయకులకు మార్గదర్శక సూత్రాలు

"ప్రియమైన దేవా, నీవు ఎంతగానో ప్రేమించే చిన్న పిల్లలకు బోధించడానికి నేను తగినట్టుగా సిద్ధపడడానికి సహాయం చేయి"

**1. పౌలు-తిమోతి పిల్లల అధ్యయనాలను ఉపయోగించండి.**



- పౌలు-తిమోతి అధ్యయన పాఠాలు కూర్పుగా ఉంటాయి. ఒక కూర్పులో కాపరుల కొరకు ఒక పాఠం మరియు అదే అంశంపై చిన్న బిడ్డలకు మరొక పాఠం ఉంటాయి. పిల్లలకై ఉద్దేశించిన పాఠంపై భాగాన "పిల్లల అధ్యయనం" అని ఉంటుంది.
- పిల్లలు కూడా పెద్దలు నేర్చుకొనే అంశాన్నే నేర్చుకొంటారు.
- పెద్దలు అధ్యయనం చేయబోయే అంశానికి సంబంధించిన ఒక బైబిల్ కథను పిల్లలు ముందుగానే నేర్చుకోవడానికి ఈ విధానం వల్ల వీలుకలుగుతుంది. కాబట్టి ఆరాధన సమయంలో వారు పెద్దల ముందు ఆ బైబిల్ కథను నాటికగా ప్రదర్శించగలుగుతారు.

**2. మీ పిల్లల ఆత్మీయస్థాయి మరియు అవసరాలకు తగిన అభ్యాస క్రియలను ఎన్నుకొండి.**

- పిల్లల అధ్యయన పాఠాలలో చాలా అభ్యాస కార్యక్రమాలు ఇవ్వబడ్డాయి. అవన్నీ మీ ఎన్నికకు ఉంచబడ్డాయి. వాటిలో నుండి మీ పిల్లల ప్రస్తుతావసరాలకు మరియు మీకున్న సమయానికి తగిన దానిని ఎన్నుకొని మిటిలిన వాటిని వదిలేయండి.

**3. పిల్లల సమావేశాలలో మరియు ఆరాధన సమయంలో పెద్దల ముందు ప్రదర్శించడానికి అనువైన వివిధ అంశాలలో పిల్లలు సిద్ధపడాలి.**

- చాలా చిన్న పిల్లలున్నట్టయితే వారంతా నిలబడి ఒక పాట పాడవచ్చు లేదా మాట్లాడవచ్చు.
- అలాగే కంఠత వాక్యాలు, చిన్న చిన్న రూపకాలు, కవితలు లేదా బైబిల్ నుండి కొన్ని వాక్యభాగాలు చదవడం కూడా దీనికి వర్తిస్తుంది.
- కొంత మంది పిల్లలు చాలా బిడియస్తులుగా ఉంటారు. మాట్లాడడానికి సిగ్గుపడుతుంటారు. మిగిలిన పిల్లలతో కలిసి వివిధ అంశాలలో పాల్గొనడంవల్ల వారి బిడియం దూరమౌతుంది.

**4. పిల్లలకు తెలిసిన రాగాలపై అల్లిన సరళమైన పాటలను పిల్లలకు నేర్పించాలి.**

- పిల్లలు బాగా ఇష్టపడే రాగాలతో కూర్చిన సరళమైన పాటలను పిల్లలకు నేర్పిస్తే వారు సంతోషంగా నేర్చుకొంటారు.
- ఆ వారంలో అధ్యయనం చేస్తున్న అంశంపై ఒక చిన్న కవితను లేదా పాటను వ్రాయమని పెద్ద పిల్లలను ప్రోత్సహించాలి.

**5. చిన్న పిల్లలతో అభినయం చేయించాలి.**

ఒక కథ చెప్పున్నప్పుడు లేదా పాటను నేర్పిస్తున్నప్పుడు తమ వేళ్ళను చేతులను, కాళ్ళను తిప్పుతూ అభినయం చేయడం పిల్లలకిష్టం. ఉదాహరణకు : దావీదు గొల్యాతును చంపిన కథను చెప్పున్నప్పుడు, వారు కూడా దానిలో పాల్గొనేలా చేయవచ్చు.

- గొల్యాతు దేవుని జనాంగమైన ఇశ్రాయేలు సైన్యాన్ని తిరస్కరించినప్పుడు, పిల్లలు పిడికిళ్ళు బిగించి, చేతులు పైకెత్తి ఊపాలి.

- దావీదు వడిసెలలో రాయి నుంచి గొల్యాతు పైకి విసిరాడని చెప్తున్నప్పుడు, పిల్లలు వడిసెలను ఊపుతున్నట్టుగా చేతులూపాలి.
- గొల్యాతు పడిపోయినప్పుడు పిల్లలు అరుస్తూ నేలపై పడిపోవడం మొదలైనవి చేయాలి.

  చిన్న పిల్లలకు శబ్దాలు చేయడం తిరిగి, తిరిగి చెప్పడం అంటే ఇష్టం.
- ఒకవేళ మీరుగానీ లేదా పిల్లలుగానీ మంచి సమరయుని కథను చెప్తున్నట్టయితే, గాడిద నడుస్తున్నప్పుడు దాని కాలిడెక్కల శబ్దాన్ని పిల్లలు అనుకరిస్తూ "క్లాప్! క్లాప్! క్లాప్!" అనాలి.
- ఒకవేళ ఆదాము, హవ్వల కథ చెప్తున్నట్టయితే సర్పము హవ్వ దగ్గరికి వచ్చిన సందర్భంలో పిల్లలు పెద్దగా పాము బుసకొట్టినట్టు "హిస్స్, హిస్స్" అని శబ్దం చేయాలి.

**6. పెద్ద పిల్లలు చిన్న పిల్లలకు బోధించాలి లేదా వివిధ అంశాలు నేర్పించాలి.**

- వారేం చేయాలో పెద్ద పిల్లలకు వివరించండి.
- వారు చేయాల్సిన పనులు సరళంగా ఉండేలా చూడండి. ఒకసారి ఒక పని చొప్పున నెమ్మదిగా, క్రమంగా తమ పనులు చేయమని పిల్లలకు చెప్పండి.

**7. పిల్లలు పెద్దలతో కలిసి ఆరాధించేలా చూడండి.**

- ఆరాధన సమయంలో పిల్లలను కూడ చేర్చుకోవడం ద్వారా ఒక కుటుంబం అన్న భావన వచ్చేలా చూడండి.
- ఆరాధన సమయంలో పెద్దల ముందు ప్రదర్శించవల్సిన అంశాలు పిల్లల అధ్యయన పాఠాలలో ఉంటాయి.
- పిల్లలను చక్కగా సిద్ధపర్చి మొదట పిల్లల సమావేశాలలో వాటిని ప్రదర్శింపజేయండి.

**8. పిల్లలను చిన్న చిన్న గుంపులుగా విభజించి వారు చెప్పే విషయాలను శ్రద్ధగా విని, వారు క్రీస్తులో ఎదగడానికి సహాయపడండి :**

- ఆరాధన సమయంలో ముగ్గురు నలుగురు కలిసి చిన్నచిన్న గుంపులుగా ఏర్పడే సమయం పౌలు–తిమోతి అధ్యయనాలు కల్పిస్తాయి. ఈ సమయంలో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి మరియు ఒకరికొరకొకరు ప్రార్థించడానికి వీలుకలుగుతుంది. ఈ గుంపులో కూడా పిల్లలుండేలా చూడాలి.
- పిల్లలతో మాట్లాడి వారితో కలిసి ప్రార్థించడానికి కొంత మంది పెద్దలను ముందుగానే సిద్ధపర్చి ఆయా గుంపులలో వారుండేలా చూడాలి.
- బైబిల్ అధ్యయనం పూర్తయిన తర్వాత ఈ సమయం కేటాయిస్తే ప్రశ్నలడగడానికి అధ్యయనం పై చర్చించి కొన్ని వాఖ్యలు చేయడానికి వీలుంటుంది.
- మనం ఒకచోట సమావేశమైనప్పుడు, ఒకరికొకరం బోధించాలనీ, ఒకరికొకరం అనేకరకాలైన పరిచర్యలు చేయాలనీ క్రొత్త నిబంధన ఉపదేశిస్తుంది. దీనిలో పిల్లలను కూడా కలుపుకోవాలి మనం అలా చేసినప్పుడు పరిశుద్ధాత్ముడు శక్తివంతంగా పనిచేస్తాడు.

**9. చిన్న చిన్న గుంపులలో పిల్లలతో మాట్లాడేటప్పుడు మీరు వారికి ఏ విధంగా సహాయపడగలరో తెలుసుకొండి.**

- ఇటువంటి ప్రశ్నలడగండి "ఈ కథలో మీకు బాగా నచ్చిన వ్యక్తి ఎవరు? ఎందుకు?
- "మీరా వ్యక్తిలా ఉండాలనుకొంటున్నారా?" అట్లాగైతే మీరేం చేయాలి?
- మీ ఇంట్లోగానీ, స్కూల్‌లోగానీ లేదా పొరుగు వారితో గానీ మీకేమైనా సమస్యలున్నాయా. ఉంటే వాటి కొరకు మనం ప్రార్థించుదామా?
- ఈ వారంలో మీరు ఎవరికైనా సహాయపడాలనుకొంటున్నారా? ఎవరికైనా దయచూపాలనుకొంటున్నారా? దాని కొరకు ఏం చేస్తారు?

- మీ అమ్మను లేదా నాన్నను సంతోషపెట్టడానికి మీరు చేయగల ఒకపని ఏదైనా చెప్పగలరా?
- మీ అన్నదమ్ములను లేదా అక్కచెల్లెళ్ళను సంతోషపెట్టడానికి ఈ వారంలో మీరు చేయబోయే ఒక పని ఏమిటి?

**10. పిల్లలు బైబిల్ కథలను నాటికలుగా ప్రదర్శించేలా చేయండి.**

- పిల్లల అధ్యయనాలలో చిన్నచిన్న నాటికలు కూడా చేర్చబడ్డాయి. ముందుగా పిల్లల సమావేశాలలో వారు వాటిని నేర్చుకొని అభ్యాసంచేసి, ఆరాధన సమయంలో పెద్దల ముందు పెద్దల సహాయంతో వాటిని ప్రదర్శించాలి.
- బైబిల్ కథలను నాటికలుగా ప్రదర్శించడానికి పిల్లలు చాలా ఇష్టపడతారు. అలా ప్రదర్శించిన కథలోని ఆత్మీయ సత్యాన్ని వారు బాగా గుర్తుంచుకోగలుగుతారు. ఈ నాటికలను క్లుప్తంగా, చిన్నగా, సరళంగా తయారుచేయాలి; పిల్లలు పెద్దపెద్ద వాక్యాలను కంఠస్థం చేసే పని ఉండకూడదు.
- ఉదా : పిల్లల సమావేశంలో యెహోషువా కానాను వారితో యుద్ధంచేసే కథ చెప్తున్నప్పుడు, టీచర్ కొంతమంది పిల్లలతో “మీరు యెహోషువా సైనికులవలె నటించండి” అని చెప్పి మిగిలిన వారితో “మీరు కనాను సైనికులు” అంటే సరిపోతుంది.
- ఒకవేళ ఏ కథనైనా నాటికగా ప్రదర్శించేటప్పుడు అన్ని పాత్రలకు సరిపోయినంత మంది పిల్లలు లేనట్టయితే ఇరుగు పొరుగు పిల్లల, సహాయం తీసుకోవచ్చు లేదా కథకుడు పాత్ర పేరు చెప్పి సంభాషణ చదవవచ్చు.
- పిల్లలు చెప్పవల్సిన మాటలను ఉపాధ్యాయుడు చెప్పి, వారితో చెప్పించాలి. అయితే పిల్లలే తగిన అభినయం చేసేలా చూడాలి. నాటికకు అవసరమైన కత్తులు, ఈటెలు మొదలైన వస్తువులు తయారు చేసుకొంటూ, వెతుక్కొంటూ వారు కొంతసేపు అటూఇటూ పరుగెత్తవచ్చు. తర్వాత వారిని నిశ్శబ్దంగా ఉంచడానికి వారితో ఏమైనా చేయించడానికి కొంత సమయం పడుతుంది. అయితే ఈ పద్ధతిలో వారు త్వరగా మరియు ఎక్కువగా నేర్చుకొంటారు అంతేకాక అలా నేర్చుకోవడానికి ఇష్టపడతారు కూడ.
- ప్రతి వారం ఆరాధన నడిపించే ముఖ్యనాయకున్ని సంప్రదించి, పిల్లలు నాటిక ప్రదర్శించడానికి ఏర్పాట్లు చేయండి.
- అన్ని పాత్రలకు సరిపోయినంత మంది పిల్లలు లేనప్పుడు, ఇరుగు పొరుగు పిల్లల సహాయం తీసుకోవచ్చు. దానివల్ల వారు కూడ క్రీస్తును కనుగొనేందుకు అవకాశం ఏర్పడుతుంది.
- పెద్ద పిల్లలు సంభాషణలు కంఠతాపెట్టి చెప్పడం కన్నా, వారు చెప్పవల్సిన మాటల భావం లేదా సారాంశం తెలిసి ఉండడంవల్ల స్వంతగా సంభాషణలు చెప్పినప్పుడే బాగా నటించగలుగుతారు. మొదట ఇది కష్టమనిపించవచ్చు కాని సమయం గడిచేకొద్ది పిల్లలు తమ ఊహలను జోడించి చక్కని సంభాషణలు చెప్తారు. దానితో నాటికరక్తి కడుతుంది. కొంత మంది పిల్లలు సంభాషణలు కంఠస్థం చేయడానికే ఇష్టపడతారు. వారిని అలాగే చెప్పనివ్వాలి. ఎలా చెప్పినా సరిగ్గా చెప్పడం ముఖ్యం.

**11. మీరు బోధించే అంశానికి తగిన బొమ్మలను లేదా వస్తువులను తయారుచేసి బోధనోపకరణాలుగా ఉపయోగించండి.**

- వస్తువులు : ఉదాహరణ : యేసు ఈ లోకానికి వెలుగు అని బోధించేటప్పుడు, పిల్లలు ఒక వెలిగించిన కొవ్వొత్తిని పైకెత్తి పట్టుకొని ఒక బైబిల్ వచనం చెప్పాలి లేదా కవితను చదవాలి.
- గుర్తులు : ఉదాహరణ : పిల్లలు మాట్లాడేటప్పుడు తాము గీసిన పటాలను చేతిలో పట్టుకోవాలి. యేసు ఒక గుడ్డివాన్ని స్వస్థపర్చిన కథ చెప్పేటప్పుడు “దేవుడు ప్రేమయై ఉన్నాడు” అని వ్రాయయబడిన అట్ట ముక్కను వారు పట్టుకోవచ్చు. మీకిష్టమైతే ముగ్గురు పిల్లలకు మూడు అట్ట ముక్కలిచ్చి వాటిలో ఒకదానిపై “దేవుడు” అని రెండవ దానిపై “ప్రేమయై” అని మూడవ దానిపై యున్నాడు అని వ్రాయాలి.
- నాట్యం : ఉదాహరణ : ఇశ్రాయేలీయులు ఆరిననేలపై ఎర్రసముద్రం దాటివెళ్ళడం వివరించేటప్పుడు మోషే మరియు ఇశ్రాయేలీయులు సముద్రాన్ని దాటిన తర్వాత దేవున్ని స్తుతిస్తూ పాడిన కీర్తన, నిర్గమకాండం 15వ అధ్యాయం నుండి ఒకరు చదువుతుండగా పిల్లలు నాట్యమాడుతూ సంబరంగా దాన్ని అభినయించవచ్చు అలాగే ఆదాము హవ్వల కథ చెప్తున్నట్టయితే పిల్లలంతా వరుసగా నిలబడాలి. అందరి కన్నా పొడుగ్గా ఉన్న బిడ్డ

ముందుండాలి, ఆ తర్వాత క్రమంగా ఎత్తు తక్కువ పిల్లలు నిలబడి ముందున్న వారిని వెనుకవారు పట్టుకోవాలి. తర్వాత పాము మెలికలు తిరిగినట్టుగా వారు వంకరటింకరగా గది అంతా హిస్స్! హిస్స్! అన్న శబ్దంచేస్తూ పరుగెత్తాలి.

మీకు అందుబాటులో ఉన్న వస్తువులను మామూలుగా రోజూ వాడే వస్తువులను ఉపయోగించండి. మీ సృజనాత్మకతను ఉపయోగించండి. చిన్నచిన్న విషయాలు బైబిల్ సత్యాలను బాగా వివరిస్తాయి. పిల్లలు ప్రతిరోజూ చూసే వస్తువులను మీరు వాడితే వాటిని చూసినప్పుడల్లా వారు దేవున్ని జ్ఞాపకం చేసుకొంటారు. వారు వివిధ వస్తువులను పట్టుకొని, వాటిని గూర్చి మాట్లాడవచ్చు.

గడ్డి – యేసు చెప్పిన విత్తువానిని గూర్చిన ఉపమానం.

ముఖాకృతి గీసిన రాళ్ళు – కోపంగా ఉన్న ముఖం చెడ్డ వారిని సూచించడానికి మరియు చిరునవ్వుతో ఉన్న ముఖం మంచి వారిని సూచించడానికి ఉపయోగించాలి.

పచ్చని ఆకులు – మంచివారు నీటి ప్రక్కన నాటబడిన మొక్కల వంటివారు (కీర్తన 1)

వాడిపోయిన ఆకులు – పండ్లులేని అంజూరపు చెట్టును యేసు శపించాడు. (మార్కు 11:12-24)

ఒక చీపురు – పరిశుద్ధాత్ముడు మన జీవితాలలో పాపాన్ని ఊడ్చివేస్తాడు.

ఒక సబ్బు బిళ్ళ – మన పాపాలను కడిగి శుద్ధిచేయగల ఏకైక సబ్బు యేసుక్రీస్తు రక్తమే

ఒక గ్లాస్ మంచి నీళ్ళు – యేసు సమరయ స్త్రీకి జీవజలాన్ని ఇస్తానని వాగ్దానం చేశాడు.

రెండు కర్రముక్కలను కలిపి కట్టాలి– సిలువ

చేప ఆకారంలో కత్తిరించిన కాగితం – పేతురు చేపలు పట్టడం

ఒక పెన్సిల్ – మన పేర్లు జీవ గ్రంథంలో వ్రాయబడ్డాయి.

పండ్లు ఉన్న గిన్నె – ఆత్మఫలాలు (గలతి 5:22-23)

ఒక అన్నం గిన్నె – క్రీస్తులో మనం పాల్గొనబోయే గొప్పవివాహ విందు ( ప్రకటన 19:6-10)

ఒక వైపు పదును చేయబడిన పొడవైన కర్ర – సైనికులు సిలువపై ఉన్న యేసు ప్రక్కలో పొడిచారు.

ఒక సుత్తె లేదా ఉలి – నోవహు మరియు అతని తోటి పనివారు ఓడను నిర్మించడానికి కొన్ని సంవత్సరాల పాటు పనిచేశారు.

ఒక పువ్వు – దేవుని సుందరమైన సృష్టి (ఆదికాండం 1) లేదా దేవుని ఏర్పాటు (లూకా 12:22-23)

ఒక ముండ్ల కొమ్మ – మానవుడు మొదట పాపం చేసినప్పుడు దేవుడిచ్చిన శాపం (ఆదికాండం 3:17-19)

Copyright © 2004 by Paul-Timothy. May be freely copied. Download from www.Paul-Timothy.net